నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, బుధవారం 18 డిసెంబర్ 2024 | MEDAK

రూ.3 లక్షల ఎల్వోసీ అందజేసిన కేటీఆర్

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 17: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రూ.3 లక్షల ఎల్వోసీని అందజేశారు. వివరాల్లోకి వెళితే...సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజవర్గంలోని మల్లన్న సాగర్ ముంపు గ్రామం ఎర్రవల్లికి చెందిన మ్యారమైన రజిత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నది. కొండపాక బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ ఆమె అనారోగ్యం గురించి ఎమ్మెల్సీ యాదవరెడ్డి దృష్టికి తీసుకువెళ్లాడు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నిరుపేద కుటుంబానికి చెందిన బాధిత మహిళ రజిత వైద్యఖర్చులకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని వివరించారు. స్పందించిన కేటీఆర్ ప్రభుత్వం నుంచి రూ.3 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించి ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి బాధిత మహిళ భర్త మల్లేశానికి అందజేశారు. బాధిత మహిళ కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



బాధిత కుటుంబానికి ఎల్వోసీ అందజేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి

చెన్నారెడ్డి ఇంటికి కరెంట్ కనెక్షన్ పునరుద్ధరణ

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 17: ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన కూరెళ్ల చెన్నారెడ్డి ఇంటికి కరెంట్ బిల్లు కట్టలేదని కరెంట్ కనెక్షన్ నిలిపివేసిన నేపథ్యంలో బాధితుడు వీడియోలో తన గోడును వెల్లబోసుకున్న వైనంపై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ కట్' 'ప్రజాపాలనలో పవర్‌కట్' అనే శీర్షికలతో మెయిన్, జిల్లా టాబ్లాయిడ్‌లలో ప్రచురితమైంది. దీంతో స్పందించిన చేర్యాల ట్రాన్స్‌కో ఏడీఈ వెంకట్ గౌడ్ బాధితుడు చెన్నారెడ్డి ఇంటిని సందర్శించారు. బాధితుడి నుంచి రూ.500 ఫైన్ తీసుకొని కరెంట్ కనెక్షన్‌ను పునరుద్ధరించారు. అదేవిధంగా ఏడీఈ ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి చెన్నారెడ్డికి గృహజ్యోతి ఎందుకు వర్తించడం లేదని వివరాలు సేకరించారు. చెన్నారెడ్డి ప్రజాపాలన దరఖాస్తు సమయంలో గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకోలేదని ఆన్‌లైన్‌లో మాపిస్తున్నట్లు ఏడీఈ వెంకట్ గౌడ్ తెలిపారు. నమస్తే తెలంగాణలో వచ్చిన కథనంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సైతం ఆరా తీసినట్లు సమాచారం. తమ బాధను వార్త రూపంలో ప్రచురించి న్యాయం చేసిన 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెల్పుతున్నట్లు బాధితుడు చెన్నారెడ్డి తెలిపారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలి

అసెంబ్లీలో గళ మెత్తిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, డిసెంబర్ 17: చరిత్ర కలిగిన చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని మంగళవారం అసెంబ్లీలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గళమెత్తారు. కోట్లాది తెలంగాణ ప్రజల ఇలవేల్పు కొమురవెల్లి మల్లన్న క్షేత్రం, నకాషీ పెయింట్స్ కలిగిన అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాంతం అన్నారు. మొదటి అసెంబ్లీ సమావేశంలో తనకు కొత్త సభ్యుడిగా అవకాశం వచ్చినప్పుడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రికి లెటర్ అందజేశామన్నారు. చేర్యాల టౌన్, చేర్యాల, కొమురవెల్లి, దూళిమిట్ట, మద్దూరు మండలాలు ఉన్నాయి. చేర్యాల ఎప్పటినుంచో నియోజకవర్గం, పాత తాలూకా కేంద్రంగా ఉంది. ఐదు మండలాలకు సంబంధించిన ప్రజలు ఒక్కొక్కరు ఒక్కో దగ్గరికి పోవాల్సి వస్తున్నది. పోలీస్ పనుల కోసం హుస్నాబాద్‌కు, రెవెన్యూ పనుల కోసం సిద్దిపేట, హుస్నాబాద్‌కు, వ్యవసాయ పనుల కోసం గజ్వేల్ పోవాల్సి వస్తున్నది. నియోజకవర్గ పనులుంటే జనగామకు రావాల్సి వస్తున్నది. ప్రజలు వివిధ రకాల పనుల కోసం వివిధ ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తూ అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. చేర్యాలలో జేఏసీ ఉద్యమం జరిగితే నాటి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వచ్చి మేము అధికారంలోకి రాగానే కచ్చితంగా చేర్యాల డివిజన్ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి కొండా సురేఖ సైతం సమీక్షా సమావేశంలో, కొమురవెల్లికి వచ్చినప్పుడు ప్రజల కోరిక తప్పక పరిష్కరిస్తామని మాట ఇచ్చారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కావడానికి ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణంలో ఉంది. కొంతమంది స్టాఫ్ ఇచ్చినట్లయితే బాగుంటుంది. గత నెలలోనే కోర్టుకు సంబంధించిన పర్మిషన్ వచ్చింది. రెవెన్యూ శాఖామాత్యులు నేను ఇచ్చిన లెటర్‌ను సిద్దిపేట కలెక్టర్‌కు పాజిబిలిటీ కోసం పంపించారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో చిన్న ప్రాంతం అయిన ఏటూరునాగారాన్ని డివిజన్‌గా చేశారు. చేర్యాలను డివిజన్ చేసి ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలన్నారు.

సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగంగా చేపట్టాలి

అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

అసెంబ్లీలో మాట్లాడుతున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, డిసెంబర్ 17: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగంగా చేపట్టి, రైతులకు సాగు నీరందించేలా చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా అప్పటి సీఎం కేసీఆర్ వృథాగా సముద్రంలోకి పోతున్న వర్షం నీటితో గోదావరి నదిపై లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు నింపారన్నారు. కాళేశ్వరం నుంచి మల్లన్నసాగర్ జలాశయానికి తరలించిన నీటిని సింగూర్‌కు తీసుకువచ్చి సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 622 మీటర్ల ఎత్తులో ఉన్న జహీరాబాద్ నియోజకవర్గంలోని రైతులకు సాగు నీరందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అందులోభాగంగానే నియోజకవర్గంలోని జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి మండలాల పరిధిలోని 115 గ్రామాల్లోని 1,03, 259 ఎకరాలకు సాగు నీరందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. అందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి మండలంలోని చిన్న చెల్మెడలో పంపుహౌస్ కోసం అప్పటి అర్థిక శాఖ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు భూమి పూజ చేశారన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో నదులు, పెద్ద చెరువులు లేవు. కేవలం వర్షాధారంపైనే రైతులు వ్యవసాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకుని సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగంగా చేపట్టి, రైతులకు సాగు నీరందించి ఆదుకోవాలన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న బక్కి వెంకటయ్య

క్రీడలతో ఆరోగ్యం

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సిద్దిపేట, డిసెంబర్ 17: క్రీడలతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సీఎం కప్ 2024 క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ..గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సీఎం కప్ దోహదపడుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ.. చదువుతో పాటు ప్రతిఒక్కరికీ క్రీడలు ముఖ్యమన్నారు. జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి జయదేవ్ మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి సెలెక్ట్ చేస్తామన్నారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్‌లోని దాయరలో అంబేద్కర్ విగ్రహానికి వినతి



మెదక్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



గజ్వేల్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



మెదక్‌లో వినతి పత్రాన్ని చూపిస్తున్న మాజీఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మెదక్ జిల్లా కేంద్రంలోని దాయర వీధిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బట్టి జగపతి, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, మెదక్ మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, పార్టీ పట్టణ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ శ్రేణులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించామని పేర్కొన్నారు. లగచర్ల రైతులపై థర్డ్ డిగ్రీ ఉపయోగించి, జైలులో పెట్టడం సరైనది కాదన్నారు. రైతుల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ ప్రజలు నిలదీయాలన్నారు. నిరంకుశ పాలనను నిరసిస్తూ ప్రజలంతా అన్నదాతలకు మద్దతు తెలుపాలన్నారు. కాంగ్రెస్ అమానీయ, అణచివేత ధోరణిని నిరసిస్తూ రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, జైలులో నిర్బంధించిన రైతులను విడుదల చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. రైతు లేనిది రాజ్యం లేదన్నారు. రైతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో కో కన్వీనర్లు లింగారెడ్డి, కృష్ణ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ కొట్టాల విశ్వం, వంజరి జయరాజు, భీమరి కిశోర్, ఆర్కే శ్రీనివాస్, నాయకులు ప్రభు రెడ్డి, మాయ మల్లేశం, రాజు, చంద్రశేఖర్ గౌడ్, శంకర్, సంగ శ్రీకాంత్, కృష్ణయ్య, కిషన్, గట్టేశ్, మ్యాకల సాయిలు, రామచంద్రరెడ్డి, సాప సాయిలు, శ్రీనివాస్ రెడ్డి, మోహన్ రాథోడ్, షాకీర్, ప్రభాకర్, లక్ష్మణ్, ముకుందాం, దశరథం, మహేశ్, కిరణ్, భువన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై దుర్మార్గంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం

- లగచర్ల రైతులను బేషరతుగా విడుదల చేయాలి
- సాగుభూములు ఇవ్వకుంటే లాఠీచార్జీలు
- సీఎం రేవంత్‌రెడ్డికి మొర పెట్టుకున్నా ఫలితం శూన్యం
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌లో వినతిపత్రాన్ని చూపిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, డిసెంబర్ 17: ప్రభుత్వం రైతులపై దుర్మార్గంగా వ్యవహరిస్తుందని, సాగు భూములను ఫార్మా కంపెనీలకు ఇవ్వమని సీఎం రేవంత్‌రెడ్డికి మొరపెట్టుకున్నా వదలడం లేదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం గజ్వేల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి లగచర్ల రైతులకు మద్దతుగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్న లగచర్ల రైతులపై లాఠీచార్జి చేసి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. భూములను ఫార్మా కంపెనీలకు ఇవ్వమని రేవంత్‌రెడ్డి అతడి సోదరులు కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం కనికరించకుండా నిర్ధాక్షిణ్యంగా వ్యవహరించారన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో రైతుల నుంచి వ్యతిరేకత వస్తున్నా ఏమాత్రం పట్టింపు లేకుండా తనకు నచ్చితే చాలు అనే దోరణితో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందని విమర్శించారు. నెల రోజులకు పైగా రైతులు జైలులోనే ఉన్నారని, వారిని ప్రభుత్వం బేషరతుగా విడుదల చేసి కేసులు ఎత్తివేయాలన్నారు. ఎలాంటి కారణం లేకుండా మాజీ ఎమ్మెల్యే పట్నం మహేందర్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖడిస్తున్నామని, ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశం గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవీ రవీందర్, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, పార్టీ మండల అధ్యక్షులు మధు, నవాజ్‌మీరా, కుమార్, మాజీ జడ్పీటీసీలు ఎల్లయ్య, మల్లేశం, కౌన్సిలర్లు శివకుమార్, అత్తెల్లి శ్రీనివాస్, బాలమణి, శ్రీనివాస్, కనకయ్య, రవీందర్, శ్రీధర్, నాయకులు కృష్ణారెడ్డి, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, దుర్గయ్య, దేవేందర్, రమేశ్‌గౌడ్, అహ్మద్, ఆర్కే శ్రీను, గొడుగు స్వామి, నర్సింగరావు, స్వామిచారి, శివకుమార్, హైదర్‌పటేల్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులను విడుదల చేయాలి

అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వినతి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, డిసెంబర్ 17: లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం నారాయణఖేడ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు బీఆర్ఎస్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు నల్లబ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహించగా, పలువురు బీఆర్ఎస్ నాయకులు సంకేళ్లతో నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ పేరుతో గిరిజన రైతుల భూములను సేకరించి రియల్ దందాకు తెరలేపే కుట్ర చేస్తున్నాడన్నారు. భూసేకరణలో భాగంగా కలెక్టర్‌పై దాడి చేశారనే అభియోగాలపై కేసులు నమోదు చేయగా, కలెక్టర్ మాత్రం తనపై దాడి జరగలేదని చెప్పడం పోలీసులు అక్రమ కేసులు పెట్టారనడానికి నిదర్శనమన్నారు. సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో ఆత్మహత్య చేసుకున్న మాజీ సర్పంచ్ సాయిరెడ్డి తన చావుకు రేవంత్‌రెడ్డి సోదరులు కారణమని సూసైడ్‌నోట్‌లో పేర్కొన్నప్పటికీ ఎటువంటి కేసులు నమోదు చేయని పోలీసులు రైతుల విషయంలో మాత్రం అత్యుత్సాహం ప్రదర్శించారని మండిపడ్డారు.

- అసెంబ్లీలో ప్రకటన చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఫలించిన బీఆర్ఎస్ నాయకుల ఒత్తిడి

సంగమేశ్వర, బసవేశ్వర పనులు ప్రారంభిస్తాం

సంగారెడ్డి, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): గోదావరి జలాలతో సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేయాలన్న కేసీఆర్ సంకల్పాన్ని చెరిపివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుంది. అధికారంలోకి రాగానే కేసీఆర్ శంకుస్థాపన చేసిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులను నిలిపివేసింది. సంగారెడ్డి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 3.84 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే రెండు ఎత్తిపోతల పథకం పనులను నిలిపివేయడంపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. బీఆర్ఎస్ సైతం కాంగ్రెస్ తీరును నిలదీసింది. మాజీమంత్రి హరీశ్‌రావు ప్రభుత్వం తీరును పలు సందర్భాల్లో ఎండగట్టారు. రైతులకు మేలు చేసే రెండు ఎత్తిపోతల పథకాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇటీవల సంగారెడ్డికి వచ్చిన మాజీమంత్రి హరీశ్‌రావు కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించేలా చూడాలని వినతిపత్రం అందజేశారు. అదేరోజు విలేకరుల సమావేశం నిర్వహించి ఎత్తిపోతల పథకాలను ప్రారంభించకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హరీశ్‌రావు హెచ్చరికలకు తోడు మంగళవారం శాసనసభలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చి సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులను కొనసాగిస్తామని చెప్పింది. అసెంబ్లీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటన చేశారు. త్వరలోనే రెండు ఎత్తిపోతల పథకం పనులను ప్రారంభిస్తామన్నారు.

3.84 లక్షల ఎకరాలకు సాగునీరు

సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల ద్వారా సంగారెడ్డి, అందోలు, నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు 2021లో నారాయణఖేడ్‌లో రెండు ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.4427 కోట్లతో రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా 3.84 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు కేసీఆర్ సర్కార్ పనులు ప్రారంభించింది. నారాయణఖేడ్, అందోలు నియోజకవర్గాల్లోని 1.71 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు రూ.1774 కోట్లతో బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులను మాజీమంత్రి హరీశ్‌రావు బోరంచలో ప్రారంభించారు. జహీరాబాద్, అందోలు, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని 2.19 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు రూ.2653 కోట్లతో మునిపల్లి మండలం చిన్నచెల్మడ వద్ద సంగమేశ్వర పనులను ప్రారంభించారు. రెండు ఎత్తిపోతల పథకం పనులకు టెండర్లు పూర్తి చేయడంతోపాటు పనులు ప్రారంభించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులను నిలిపివేసింది. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్‌రెడ్డి ఎత్తిపోతల పనులను ప్రారంభించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో నీటిపారుదల శాఖ మంత్రి అసెంబ్లీలో ప్రకటన చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

కంది, డిసెంబర్ 17: క్రీడలతో నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులకు మానసికోల్లాసం కలుగుతుందని మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీజీఎం ఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ(ఓడీఎఫ్) శరత్ స్టేడియంలో ఏవీఎన్ ఎల్ చైర్మన్స్ కప్ 2024 క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలు మంగళవారం నుంచి శనివారం వరకు జరగనున్నాయి. క్రికెట్, వాలీబాల్, బాస్కెట్ బాల్ పోటీల్లో దేశంలోని అన్ని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలకు చెందిన ఉద్యోగులు పాల్గొంటున్నారు. క్రీడాజ్యోతిని వెలిగించిన సీజీఎం క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, పట్టుదల, స్నేహభావం, నైపుణ్యాలను పెంపొందిస్తాయన్నారు. ఎలాంటి విద్వేషాలు లేకుండా క్రీడాస్ఫూర్తిని చాటాలని కోరారు.అంతకుముందు స్టేడియంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, మిలిటరీ బ్యాండ్ విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఓఎల్ఎంకే సీజీఎం రాజీవ్ మాథుర్, ఏవీఎన్ఎల్ మెదక్ యూనిట్ చైర్‌పర్సన్ రంజన ప్రసాద్, ఓడీఎఫ్ అధికారులు, ఉద్యోగులు, ఆర్డినెన్స్ ఫ్టాక్టరీలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాజెండాను ఎగురవేసి గౌరవ వందనాన్ని సమర్పిస్తున్న ఓడీఎఫ్ సీజీఎం, అతిథులు

లోన్‌యాప్ వేధింపులతో యువకుడి ఆత్మహత్య

- కాట్రియాలలో ఘటన

రామాయంపేట, డిసెంబర్ 17: లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపుల వల్ల ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రామాయంపేట మండలం కాట్రియాలలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మద్ది గంగాధర్(28) ఆన్‌లైన్ లోన్ యాప్‌లో రూ. 3.20 లక్షల రుణాన్ని పొందాడు. తీసుకున్న రుణంలో రూ.1.20 లక్షల రుణాన్ని కిస్తీల రూపంలో చెల్లించాడు. కిస్తీల సమయం దాటిపోవడంతో ఆన్‌లైన్ లోన్‌యాప్ నుంచి కచ్చితంగా డబ్బులు చెల్లించాలంటూ మొబైల్‌కు వాట్సాప్ మెస్సెజ్‌లు రావడం, లోన్ కట్టకపోతే ఆస్తులు జప్తు చేస్తామని, కేసులు నమోదు చేస్తామంటూ వేధించడంతో చేసేదేమీలేక మూడు రోజుల క్రితం కాట్రియాల శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు వెంటనే రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కామారెడ్డిలోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించారు. మూడు రోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి యువకుడు మృతిచెందాడు. ఈ విషయమై పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంగాధర్ (ఫైల్)

- సంగారెడ్డి జిల్లాలోని ఏడు కళాశాలలకు రూ.63 లక్షల 76వేలు విడుదల

అతిథుల ఐదునెలల వేతనాలు విడుదల

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 17: 'అతిథుల ఆర్తనాదాలు' అనే శీర్షికన ఇటీవల 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాల్లో ఐదు నెలల వేతనాలు విడుదలయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు ఆరు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులకు గురవుతున్న తీరును కథనంలో పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు అతిథి అధ్యాపకులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను ఉన్నత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇన్నాళ్లుగా కదలని వేతన బడ్జెట్ ఫైల్ చకచకా ఆయా దశలను పూర్తి చేసుకొని ఎట్టకేలకు వేతనాలు విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా, ఆయా కళాశాలలకు అక్టోబర్ వరకు మొత్తం